సాక్షి

పశ్చిమగోదావరి

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



చిరుద్యోగులపై పచ్చ ప్రతాపం

చిరుద్యోగులైన వీఓఏ (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్)ల జీవితాలతో కూటమి నేతలు చెలగాటమాడుతున్నారు. బెదిరింపులతో ఆందోళన కలిగిస్తున్నారు. 8లో ▸



మట్టి దందా..

పంగిడిగూడెంలో టీడీపీకి చెందిన ఒక చోటా నాయకుడు మట్టిదందాకు పాల్పడుతున్నాడు. కాలువ గట్టును యథేచ్ఛగా కొల్లగొడుతున్నాడు. 8లో ▸



ఖోఖో విజేత రాజమండ్రి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళల ఖోఖో పోటీల్లో రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. 8లో ▸

న్యూస్‌రీల్

మోషేన్‌రాజును కలిసిన ఎమ్మెల్సీ గోపిమూర్తి



ఎమ్మెల్సీని అభినందిస్తున్న మండలి చైర్మన్

భీమవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన బొర్రా గోపిమూర్తి గురువారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమొక్క అందించారు. గోపిమూర్తికి మోషేన్‌రాజు అభినందనలు తెలిపారు.

స్వర్ణాంధ్ర డాక్యుమెంటరీకి ప్రజలను తరలించాలి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం(ప్రకాశం చౌక్): స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణలో జిల్లా ప్రజలు పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి కోరారు. గురువారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణకు తరలి వెళ్లేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. శుక్రవారం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణ సభకు వివిధ వర్గాల ప్రజలను తరలించేలా పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి మూడు కేటగిరీల కింద ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. అన్నిశాఖ అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, సీపీఓ శ్రీనివాసరావు, ఆర్డీఓ దాసిరాజు, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

నరసాపురం: వివాదాస్పద భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారనే అభియోగంపై నరసాపురం సబ్ రిజిస్ట్రార్ ఎంవీటీ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఐజీ ఉత్తర్వులిచ్చారు. గుంటూరులో ఉన్న ఓ భూమిని నరసాపురంలో రిజిస్ట్రేషన్ చేసినట్టు చెబుతున్నారు. సదరు భూమికి అడంగళ్ రికార్డులు లేకపోవడమే కాకుండా కోర్టు వ్యవహారంలో కూడా ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై ఫిర్యాదులు అందడంతో ప్రాథమిక దర్యాప్తు చేసిన ఐజీ సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అలీ అనే డివిజన్‌లోని ఓ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి చక్రం తిప్పినట్టు సమాచారం.

రేపటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

భీమవరం (ప్రకాశం చౌక్): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఆలపాటి రఘునాథ్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. స్వయం సహాయక మహిళ బృందాలతో ముగ్గు పోటీలు నిర్వహించి, వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కళాశాలల్లో వర్కుషాపులు, విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో శనివారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని 20 మండలాల్లోని 320 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. భీమవరం డివిజన్‌లో 119, నరసాపురం డివిజన్‌లో 111, తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో 90 గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు డివిజన్‌ల వారీగా భీమవరంలో 6, నరసాపురంలో 12, తాడేపల్లిగూడెంలో 7 సదస్సులు ప్రారంభిస్తామన్నారు.

కౌశల్ పరీక్షలో ప్రతిభ

పెంటపాడు: కౌశల్–2024 ప్రతిభా పరీక్షలో పరిమెళ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి నిమ్మ బాలాజీ శ్రీమణికంఠ (9వ తరగతి) జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు హెచ్ఎం కాంతిశ్రీ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29,30 తేదీల్లో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు అర్హత సాధించాడని పేర్కొన్నారు.

అన్నదాత ఆక్రందన

సర్కారు పగ.. రైతు దగా

- పెట్టుబడి సాయం గాలికొదిలేసిన సీఎం చంద్రబాబు
- ఉచిత పంటల బీమా ఎత్తేసి ప్రీమియం భారం మోపిన సర్కారు
- వరుస విపత్తులు, దళారుల దోపిడీతో రైతు కుదేలు
- ఆదుకోని కూటమి ప్రభుత్వం
- రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాట
- నేడు కలెక్టరేట్‌లో వినతిపత్రాల అందజేత



తమ ప్రభుత్వం రాగానే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. ఉచిత పంటల బీమా పథకానికి మంగళపాడి రైతులపై ప్రీమియం భారాన్ని మోపారు. ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థకు గేట్లు తెరిచారు. కూటమి పాలనలో దగాపడిన రైతులకు అండగా వైఎస్సార్ సీపీ పోరుబాట చేపట్టింది. రైతు సమస్యల పరిష్కారానికి శుక్రవారం రైతులతో కలిసి భీమవరంలోని కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రాలు అందజేయనుంది. – సాక్షి, భీమవరం

కూటమి పాలనలో అన్నివిధాలా రైతులు దగా



కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలా దగా చేసింది. అన్నదాత సుఖీభవ సాయం ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదు. వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడం లేదు. దళారీ వ్యవస్థకు మరలా గేట్లు తెరవడంతో మద్దతు ధర అందడం లేదు. ఎన్నికల హామీలను అమలుచేసి రైతు సమస్యలు పరిష్కరించే నిమిత్తం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలని పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరుతున్నాం.

– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు



తేతలిలో ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు (ఫైల్)

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన రైతు భరోసా సాయం

సంవత్సరం	రైతులు	సాయం (రూ.కోట్లలో)
2019–20	1,09,302	147.56
2020–21	1,24,664	168.30
2021–22	1,17,791	159.02
2022–23	1,13,597	153.36
2023–24	1,24,645	168.17

ఉచిత పంటల బీమా

- జిల్లాలో సుమారు 7 లక్షల మందికి ప్రీమియం వర్తింపు
- బీమా కంపెనీలకు ప్రభుత్వం చెల్లించింది రూ.140 కోట్లు
- రైతులకు పంట నష్టపరిహారం చెల్లింపు 1,14,011 మందికి రూ.217.64 కోట్లు

నేడు కలెక్టరేట్ వద్ద వైఎస్సార్ సీపీ ధర్నా

రైతు భరోసా ఊసెత్తకపోవడం, ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి రైతులపై భారం మోపడం, ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు, తొలకరి పంట నష్టపరిహారం అందించకపోవడం, సున్నా వడ్డీ, పంట రుణాలు సరిగా మంజూరు చేయని కూటమి పాలనపై వైఎస్సార్‌సీపీ పోరుబాట చేపట్టింది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతు సమస్యలు పరిష్కరించే దిశగా రైతులు, జిల్లాలోని పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం ఉదయం భీమవరంలోని కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేయనున్నారు. ఇలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నారు.

నాడు

పెట్టుబడి సాయంతో భరోసా

గత ప్రభుత్వంలో పెట్టుబడులు కోసం ఇబ్బంది పడాల్సిన పనిలేకుండా సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు సాయం అందించారు. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6 వేలకు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500లు జతచేసి ఏటా రూ.13,500లు చొప్పున అందించారు. తొలి విడతగా మే నెలలో రూ.7,500, ఖరీఫ్ చివర్లో రూ.4,000, దాళ్వా ప్రారంభంలో రూ.2,000 చొప్పున ఖాతాల్లో జమచేసేవారు. సాగు పెట్టుబడులకు రైతులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడింది. ఇలా గత ఐదేళ్లలో రైతు భరోసాగా జిల్లాలోని 1,17,999 మంది రైతులకు రూ.796.49 కోట్లు సాయం అందింది.

నేడు

ఒక్క రూపాయీ విదల్చని కూటమి

జిల్లాలో తొలకరి మాసూళ్లు దాదాపు పూర్తి కావస్తున్నాయి. 2 లక్షల ఎకరాల్లో సాగు చేయగా ప్రారంభం నుంచి విపత్తులు, పంట తెగుళ్ల రూపంలో రైతులను కష్టాలు వెంటాడాయి. భారీ వర్షాలు, వరదలతో తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, భీమవరం తదితర నియోజకవర్గాల్లోని 14 వేల ఎకరాల్లోని నాట్లు, 30 వేల ఎకరాల్లోని నారుమడులు దెబ్బతిన్నాయి. ఆయా చోట్ల రెండోసారి నాట్లు వేయాల్సి రావడంతో పెట్టుబడులు రెట్టింపై రైతులు అప్పుల పాలయ్యారు. పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర సాయం మాత్రమే రైతులకు అందగా.. ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం పథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చడం మినహా ఒక్క రూపాయి కూడా విదల్చలేదు.

నాడు

ఉచిత పంటల బీమాతో ధీమా

రైతుపై ప్రీమియం భారం పడకుండా 2019 ఖరీఫ్ నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా వర్తించడంతో పంట నష్టం వాటిల్లితే రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత ఐదేళ్లలో ఏటా 1.4 లక్షల మంది చొప్పున జిల్లాలోని ఏడు లక్షల మంది తరఫున ప్రీమియం రూపంలో బీమా కంపెనీలకు దాదాపు రూ.140 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. పంట నష్టపోయిన 1,14,011 మంది రైతులకు రూ. 217.64 కోట్లను పరిహారం అందించి అండగా నిలిచింది.

నేడు

రైతులపై బీమా భారం

ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం ఎసరు పెట్టింది. రానున్న రబీ సీజన్ నుంచి రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని నిర్ణయించింది. రైతులు ఎకరాకు పంట విలువ రూ.41,000లో ప్రీమియంగా రెండు శాతం మొత్తం రూ.820లు బీమా కంపెనీకి చెల్లించాల్సి ఉంది. దీనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 0.5 శాతం వాటా అంటే రూ.205లు మినహాయిస్తే మిగిలిన 1.5 శాతం మేర రూ.615లు రైతులే చెల్లించాలి. జిల్లాలోని 2.3 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరుగనుండగా పంటల బీమా ప్రీమియం రూపంలో జిల్లాలో రైతులపై కూటమి ప్రభుత్వం రూ.14.15 కోట్ల భారాన్ని మోపింది. ఇప్పటికే వరుస విపత్తులు, తగ్గిన దిగుబడులతో ఇబ్బంది పడుతున్న రైతులకు బీమా భారంగా మారింది.

నాడు

కొనుగోళ్లకు ప్రాధాన్యం

ధాన్యం అమ్మకాల్లో రైతుల కష్టం దళారుల పాలవ్వకుండా, ఏ దశలో వారి జోక్యానికి ఆస్కారం లేకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుదిట్టం చేసింది. రైతులకు పూర్తి మద్దతు ధర దక్కేలా ఆర్‌బీకేలు, సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తూ వచ్చింది. ధాన్యం ఏ రైస్‌మిల్లుకు వెళ్లాలనేది కంప్యూటరే నిర్ణయించేలా సాఫ్ట్‌వేర్ రూపొందించింది. రైతు ఆర్‌బీకే/సొసైటీకి ధాన్యం శాంపిల్ తీసుకువెళితే చాలు మిగిలిన కొనుగోలు ప్రక్రియ అంతా వ్యవసాయ సిబ్బంది చూసుకునేవారు. పూర్తిస్థాయిలో సంచులు అందుబాటులో ఉంచేది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ రైతులకు అండగా ఉండి వారికి మద్దతు ధర అందించింది.

నేడు

దళారుల రాజ్యం

ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం గేట్లు తెరిచింది. దళారులు తెరవెనుక ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. తేమశాతం, తాలుగింజల సాకుతో ధరకు కోత పెడుతున్నారు. ఇటీవల ఫెంగల్ తుపాను సమయంలో వారు చెప్పిందే ధర. కామన్ రకం 75 కేజీల బస్తాకు రూ.1,725లు మద్దతు ధర కాగా తేమశాతం ఎక్కువగా ఉందని చెప్పి బస్తాకు రూ.200 నుంచి రూ.300 వరకు కోత పెట్టారు. వాతావరణం ఎప్పుడెలా ఉంటుందోనని జడిసి కల్లాల్లోని ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకోవడంతో ఎకరాకు రూ.6 వేల నుంచి రూ.9 వేల వరకు రైతులు నష్టపోవాల్సి వచ్చింది. రవాణా, హమాలీ ఖర్చుల రూపంలోనూ బస్తాకు రూ.30 నుంచి రూ.40లు వరకు నష్టపోయారు.

పెట్టుబడులకు ఇబ్బంది



నేను మూడు ఎకరాలు కౌలుకు చేస్తున్నా. కూటమి ప్రభుత్వంలో మమ్మల్ని పట్టించుకోవడం లేదు. పెట్టుబడి సాయం కింద ఒక్క రూపాయి ఇవ్వలేదు. దీంతో పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నాం. మరలా దళారుల దగ్గరికి వెళ్లి అప్పులు తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందించాలి.

– తామరపల్లి మునలయ్య, కౌలు రైతు, అర్జునుడు పాలెం శివారు పెద్దిరెడ్డిపాలెం

ప్రభుత్వమే బీమా చెల్లించాలి



అధిక వర్షాలు, తుపానుల వలన ఈ సార్వా నష్టపోయాం. పెట్టుబడులు కూడా రావడం లేదు. మళ్లీ దాళ్వా సాగుకు పెట్టుబడి పెట్టాలంటే అప్పులు తప్పవు. ఈ నేపథ్యంలో రైతులపై బీమా ప్రీమియం కట్టాలని ఒత్తిడి తేవడం సరికాదు. గత ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడూ రైతుల తరఫున బీమా ప్రీమియం చెల్లించాలి.

– మంద హరికుమార్, రైతు, కాంబొట్లపాలెం

దళారుల దోపిడీ



చంద్రబాబు ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయకుండానే సార్వా పంట కాలం సాగిపోయింది. ఈ ఏడాది పంటలు కూడా అంతంత మాత్రమే. గత ప్రభుత్వంలా ఉచిత బీమా అయినా అమలు చేస్తే బాగుండేది. తేమ పేరుతో మిల్లర్లు, దళారుల దోపిడీకి రైతు గురికాక తప్పట్లేదు. ఎటువంటి పెట్టుబడి సాయం అందలేదు.

– తెన్నేటి ఆంజనేయులు, సన్నకారు రైతు, పెనుమంట్ర

భరోసా లేదు



నాకు అర ఎకరా పొలం ఉంది. గతంలో ప్రతి పంటకూ ఉచిత పంటల బీమా వర్తించేది. ఇప్పుడు ఎకరాకు రూ.615 ప్రీమియం చెల్లించాలంటున్నారు. ఈ ఏడాది సార్వా పంట చేతికి దక్కకుండా పోయింది. బీమా సొమ్ము రాలేదు. గత ప్రభుత్వం కంటే మిన్నగా ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పటికీ రైతు భరోసా సాయమే అందించలేదు.

– గుంపుల మందులు, రైతు, చామకూరపాలెం, నరసాపురం మండలం

విజేతగా 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత'

ముగిసిన జాతీయస్థాయి నాటిక పోటీలు



నాటిక పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

వీరవాసరం: తోలేరులో నిర్వహిస్తున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ 20వ జాతీయస్థాయి నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా తెలుగు కళా సమితి (విశాఖ) నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత నాటకం నిలిచింది. విజేతలకు గురువారం బహుమతులు అందించారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ (గుంటూరు) ఇంద్రప్రస్థం, తృతీయ ప్రదర్శనగా నటీనట సంక్షేమ సమాఖ్య (పాలకొల్లు) అనూహ్య, జ్యూరీ ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ (కాట్రపాడు) కిడ్నాప్ నాటికలు నిలిచాయి. ఉత్తమ దర్శకత్వం చలసాని కృష్ణప్రసాద్ ఉత్తమ నటుడు పి.వరప్రసాద్ , ఉత్తమ నటి జ్యోతి రాణి ఉత్తమ ప్రతినాయకుడు నడింపల్లి వెంకటేశ్వరరావు బహుమతులు గెలుచుకున్నారు. ద్వితీయ ఉత్తమ నటుడిగా ఎంవీ రాజర్షి, ద్వితీయ ఉత్తమ నటిగా గుడివాడ లహరి, ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా ఈటి రాంబాబు, ఉత్తమ క్యారెక్టర్ నటిగా ఎస్.పూజిత (కిడ్నాప్), ఉత్తమ రంగాలంకరణ చైతన్య కళాభారతి కరీంనగర్, ఉత్తమ ఆహార్యం ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు, ఉత్తమ సంగీతం ఇంద్రప్రస్థం నాటిక, ఉత్తమ బాల నటుడు మణికంఠ, ఉత్తమ బాల నటి గీత శ్రేష్ఠ ఎంపికయ్యారని పరిషత్ నిర్వాహకులు చావాకుల సత్యనారాయణ తెలిపారు.

కళాకారులను గౌరవించాలి

నాటక రంగం ద్వారా సమాజంలోని రుగ్మతలను రూపుమాపవచ్చని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కళలను ఎక్కడ గౌరవిస్తారో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, మళ్ల తులసి రాంబాబు, చవ్వాకుల నరేష్‌కుమార్, అడబాల లక్ష్మీనారాయణ రాజు, పోకల జ్యోతిలను సత్కరించారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, గూడూరి ఉమాబాల, బుద్దాల వెంకట రామారావు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక పాలనపై పోరాటం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



భీమవరంలో పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ముదునూరి ప్రసాదరాజు

భీమవరం: రైతులకు మద్దతుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామని, ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం భీమవరం నియోజకవర్గ పార్టీ ముఖ్యనేతల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు మేలు జరగపోగా ఇబ్బందులు పాలుచేస్తున్నారని విమర్శించారు. రైతులకు రైతు భరోసా సహాయం ఎగ్గొట్టడమేగాక వరదలు, వర్షాలు కారణంగా నష్టపోయిన వారికి మొండిచేయి చూపించారన్నారు. పంటకు గిట్టుబాటు ధర దక్కకుండా దళారులు, రైస్‌మిల్లర్లకు మేలుచేసేలా ప్రభుత్వ విధానాలున్నాయన్నారు. నష్టపోయిన రైతులకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ శుక్రవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, రైతులు హాజరుకావాలని ప్రసాదరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం అందిస్తామని తెలిపారు. నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం త్వరలో నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పాలకొల్లు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు, పార్టీ మైనార్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు, నాయకులు ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, కోడే యుగంధర్, మద్దాల అప్పారావు, పేరిచర్ల సత్యనారాయణరాజు, తిరుమాని ధనుంజయ, వీరవల్లి రాధాకృష్ణ, కొమ్మన శ్రీనివాసరావు, చిరుగుపాటి సందీప్, గారిరాజు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సాధనాలతో ఎక్కువ ఫలితాలు



మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో మాట్లాడుతున్న అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ శ్రీనివాస్

పెనుమంట్ర: వరి పంటను ఆశించే 18 రకాల పురుగులు, తెగుళ్లపై ఆన్‌లైన్‌లో పొందుపర్చిన సస్యరక్షణ సిఫార్సులను శాస్త్రవేత్తలు పూర్తిగా పరిశీలించి, రాష్ట్రానికి అనువుగా ఉండేలా మార్పులు చేయాలని అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ టి. శ్రీనివాస్ అన్నారు. గురువారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వరి పంట సస్యరక్షణలో మార్గదర్శకాలు అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న సమాచార అవసరాలకు అనుగుణంగా ప్రజలంతా డిజిటల్ సాధనాలపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. పరిశోధన విస్తరణలో డిజిటల్ సేవలతో తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మధుమంజరి మాట్లాడుతూ గతనెల 13న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కాబి ఇంటర్నేషనల్ వారి మధ్య ఒప్పందం జరిగిందన్నారు. ఈ మేరకు యాప్‌లో సమాచారం నిక్షిప్తం చేస్తారన్నారు. ప్రధాన శాస్త్రవేత్త ఎంపీ కృష్ణాజీ పాల్గొన్నారు.

ఘనంగా ది చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం



మాల్‌లో సందడి చేస్తున్న సినీ నటి మీనాక్షి చౌదరి

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలో నూతనంగా ఏర్పాటుచేసిన ది చెన్నై షాపింగ్ మాల్‌ను గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. లక్కీ భాస్కర్ ఫేమ్, హీరోయిన్ మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా చీరల విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె సందడి చేశారు. షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన రూ.99ల చీరలకు విశేష స్పందన లభించింది. షాపింగ్‌మాల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సంగీత విభావరిలో భాగంగా నిర్వహించిన సినిమా క్విజ్‌లో విజేతలకు రూ.99 చీరలను బహుమతిగా ఇచ్చారు. ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, ఈతకోట భీమశంకరరావు, వలవల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖోఖో పోటీల్లో విజేత రాజమండ్రి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ సుమతి, ప్రిన్సిపాల్ నత్తానియేలు

దెందులూరు : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళల ఖోఖో పోటీల్లో రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల విజేతగా నిలిచింది. గోపన్నపాలెం వ్యాయామ కళాశాల ద్వితీయ స్థానం సాధించింది. దెందులూరు మండల గోపన్నపాలెంలోని శ్రీ సీతారామప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న మహిళల ఖోఖో పోటీలు గురువారం ముగిశాయి. గెలుపొందిన జట్లకు తహసీల్దార్ బీ.సుమతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నత్తానియేలు బహుమతులు అందించారు.

తిరుమల శ్రీవారి సేవా టికెట్లు ఇప్పిస్తానని మోసం

నరసాపురం: టీటీడీ సేవా టికెట్లు ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పంజా సెంటర్‌కు చెందిన గవర వెంకటనాయుడుకు ఇదే ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ నాయుడు తిరుమల శ్రీవారి సేవాటికెట్లు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఒక్కో టికెట్ ధర రూ.12,500 అని చెప్పాడు. దీంతో మూడు టికెట్లకు రూ.37,500 శ్రీకాంత్‌నాయుడు చెప్పిన ఫోన్ నెంబర్‌కు వెంకటనాయుడు గత నెల 21వ తేదీన ఫోన్‌పే చేశాడు. అనంతరం అతను తప్పించుకు తిరగడంతో తాను మోసపోయానని గ్రహించి బాధితుడు వెంకటనాయుడు గురువారం పట్టణ పోలీసుకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై జయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో మహిళ మృతి



కదారి ఆదిలక్ష్మి (ఫైల్)

దెందులూరు: పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. వివరాల ప్రకారం.. పోతునూరు గ్రామానికి చెందిన కదారి ఆదిలక్ష్మి (45) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గురువారం ఆమె పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి కూలి పనుల నిమిత్తం వెళ్లింది. పొలంలో పాము కాటు వేయడంతో ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నరసాపురంలో చోరీ

నరసాపురం: పట్టణంలోని 28వ వార్డులో తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పట్టణ ఎస్సై ముత్యాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతనెల 17వ తేదీన బందుల రూతమ్మ ఇంటికి తాళం వేసి మొగల్తూరు మండలంలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం ఇటికి తిరిగి రాగా తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించింది. ఇంటికి లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉంచిన 30 తులాల వెండి, మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించింది.

చిరుద్యోగులపై పచ్చ ప్రతాపం

- కూటమి నేతల వేధింపులతో అల్లాడుతున్న వీఓఏలు
- గడిచిన ఐదు నెలల్లో 86 మంది వీఓఏల తొలగింపు
- తెలుగు తమ్ముళ్లకు వత్తాసు పలుకుతున్న అధికారులు
- ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వీఓఏలు పోరుబాట



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఓఏలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్) : చిరుద్యోగులైన వీఓఏ(విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్)ల జీవితాలతో కూటమి నేతలు చెలగాటమాడుతున్నారు. నామమాత్రపు గౌరవ వేతనం రూ.8 వేలతో కాలం వెళ్లిబుచ్చుతున్న వీఓఏలపై పచ్చ నేతలు తమ ప్రతాపం చూపుతున్నారు. గత ఐదు నెలలుగా వారికి వేతనాలు అందని పరిస్థితి. దీనికి తోడు ఏకంగా 86 మంది వీఓఏలను వివిధ కారణాలు చెప్పి తొలగించేశారు. మిగిలిన వారిపై సైతం కూటమి నేతలు బెదిరింపులకు దిగుతున్నారు. ఈ ప్రభుత్వం మాది.. మేము చెప్పినట్టే వినాలి.. లేకుంటే రాజీనామా చేసి వెళ్లిపోండి.. మాకు కావాల్సినవారిని పనిలో పెట్టుకుంటామంటూ హుకుం జారీ చేస్తున్నారు. దీంతో వీఓఏలు అల్లాడిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో భాగమైన జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల కన్నా టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఈ తరహా ఘటనలు ఎక్కువైపోయాయని బాధితులు వాపోతున్నారు. దీంతో చేసేదిలేక వీఓఏలు పోరుబాట పట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఇటీవల కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

86 మంది వీఓఏల తొలగింపు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 39,539 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. వీటి పరిధిలో 3,89,801 మంది సభ్యులు ఉన్నారు. గ్రామ సమాఖ్యలు 1300 వరకు ఉన్నాయి. మరో 30 వరకూ రిజిస్టర్డ్ కాని గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. వీటి పరిధిలో అంతే సంఖ్యలో 1300 మంది వీఓఏ(విలేజీ ఆర్గనైజింగ్ అసిస్టెంట్)లు పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల వ్యవధిలోనే 86 మందిని ఎటువంటి కారణాలు లేకుండా తొలగించేశారు.

కోర్టు ఉత్తర్వులు సైతం బేఖాతర్

తెలుగు తమ్ముళ్లు వివిధ కారణాలు చూపించి లింగపాలెం మండల పరిధిలో 11 మంది వీఓఏలను తొలగించేలా చేశారు. వీరిలో ఏడుగురు ఎస్సీలు ఉండటం గమనార్హం. వీరంతా కలిసి కోర్టుకు వెళ్లారు. వారిని యథావిధిగా విధుల్లో కొనసాగించాలంటూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఇక్కడ వరకూ బాగానే ఉన్నా వీరు ఇంతకు ముందు పని చేసే చోట కొత్తవారిని నియమించేశారు. దీంతో ఆ 11 మంది కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ డీఆర్‌డీఏ అధికారులకు, మీకోసంలో కలెక్టర్‌కు తమ గోడు మొరపెట్టుకున్నారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పుడు ఇబ్బంది ఏమి ఉంది.. వెళ్లి మీ విధులు మీరు చేసుకోండి అని చెప్పి అధికారులు పంపించేస్తున్నారు. తీరా అక్కడకు వెళితే ఆ మండల ఏపీఎం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో ఒక్క మాట చెప్పి విధుల్లోకి తీసుకుంటామంటూ కాలం గడిపేస్తున్నారు. దీంతో బాధితులు ఎవ్వరికీ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి.

దాటవేత ధోరణిలో అధికారులు

తమను అక్రమంగా విధుల్లోంచి తప్పించేస్తున్నారంటూ బాధిత వీఓఏలు డీఆర్‌డీఏ, మీకోసం ద్వారా కలెక్టర్‌కు మొరబెట్టుకుంటున్నా ఫలితం ఉండని పరిస్థితి. డీఆర్‌డీఏ అధికారులైతే ఈ వ్యవహారంలో తమను తలదూర్చవద్దని ప్రభుత్వం చెప్పిందని, గ్రామ సమైఖ్య తీర్మానం ప్రకారం వీఓఏలను నియమించడం జరుగుతుందని దాటవేత ధోరణి అవలంభిస్తున్నారు. రాజకీయ దురుద్దేశంతో అన్యాయంగా విధుల్లోంచి తొలగించడం సమంజసం కాదని వీఓఏలు ఆవేదన చెందుతున్నారు.

వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం



ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామంలో వంపుగడప శారద 15 ఏళ్లుగా వీఓఏగా పనిచేస్తోంది. ఇటీవల ఎన్నికల అనంతరం.. నువ్వు మానేస్తే నా ఇంట్లో పనిమనిషిని వీఓఏగా పెడతా అంటూ గ్రామానికి చెందిన టీడీపీ నేత వేధింపులకు దిగారు. దీంతో చిరుద్యోగంపై ఆధారపడిన ఆమె వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించింది. బంధువులు సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ఆమె బ్రతికి బయటపడింది.

రాజకీయాలతో ముడిపెట్టి వేధింపులు



నేను గత పదేళ్లకు పైగా వీఓఏగా పనిచేస్తున్నాను. నా భర్త గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీలో తిరిగారనే సాకుతో కూటమి నేతలు వేధింపులకు గురిచేస్తున్నారు. నీవు ఉద్యోగం నుంచి వైదొలగితే మా కార్యకర్తను పెట్టుకుంటామంటూ బెదిరిస్తున్నారు. నా విధుల్లో ఏమైనా లోపం ఉంటే సమీక్షించి చర్యలు తీసుకున్నా పర్వాలేదు. కానీ రాజకీయాలతో ముడిపెట్టి వేధింపులకు గురిచేయడం ఎంత వరకు సమంజసం. - మల్లెల్లి ద్వారకా, లింగగూడెం, చింతలపూడి మండలం

తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలి



విధుల్లోంచి తొలగించిన వీఓఏలను తక్షణం విధుల్లోకి తిరిగి తీసుకోవాలి. వారికి గత ఐదు నెలలుగా బకాయి పడ్డ వేతనాలు విడుదల చేయాలి. ఎక్కడైనా ఎవరైనా తప్పుచేస్తే వారిపై శాఖపరమైన విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలే తప్ప ఈ విధంగా చేయడం తగదు. రాజకీయ వేధింపులు, కక్ష్య సాధింపు ధోరణులు అమానవీయం. వీఓఏల పక్షాన నిలబడి పోరాటం చేస్తాం. - ఆర్.లింగరాజు, జిల్లా అధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు

వీఓఏలను నేరుగా బెదిరిస్తున్నారు



ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తే సహించేది లేదని నేరుగా టీడీపీ నేతలు వీఓఏలను బెదిరిస్తున్నారు. చింతలపూడి మండలంలో ఒక టీడీపీ నాయకుడు ఏకంగా మండలంలో ఎవరూ రోడ్డెక్కడానికి వీల్లేదని.. ఎవరైనా అతిక్రమిస్తే ఆరోజు నుంచి విధుల్లోకి రావాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే హక్కు రాజకీయ నాయకులకు ఎవరు ఇచ్చారు. - ఎస్‌కే సుభాషిణి, వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి, ఏలూరు

విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు



మీర్జాపురం సబ్‌స్టేషన్‌లో దాడుల వివరాలు తెలుపుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

నూజివీడు: మండలంలోని మీర్జాపురం సెక్షన్‌లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఏ సత్యన్నారాయణ, విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది 41 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా 2994 గృహ సర్వీసులను, 156 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేసి అదనపు లోడు వాడుతున్న 165 సర్వీసులకు రూ.5.40 లక్షల జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఈ ఏ సత్యన్నారాయణ హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లయితే ఫోన్ నెంబర్లు 94408 12362, 94408 12363, 83310 14951కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో రూరల్ డీఈ ఎం పోతురాజు, ఏఈ కే బాబూరావు, డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

15న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న జిల్లా జూనియర్స్ కబడ్డీ బాలురు, బాలికల జట్ల ఎంపిక ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్రీకాంత్, అప్పలరాజు అచ్యుతారావు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 2005 జనవరి 12 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికైన జట్లు రావులపాలెంలో నిర్వహించనున్న 50వ జూనియర్స్ కబడ్డీ స్టేట్ మీట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని వివరించారు. వివరాలకు 99851 47123, 94913 33906 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అస్వస్థతకు గురైన విద్యార్థులకు పరామర్శ

- మధ్యాహ్న భోజనం తిని 9 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



విద్యార్థులను పరామర్శిస్తున్న మేకా ప్రతాప్

నూజివీడు: నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను గురువారం నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరామర్శించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. చాట్రాయి మండలంలోని కోటపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 9 మంది విద్యార్థులు కడుపులో నొప్పి, వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థులను పరామర్శించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించేలా ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కాగా గత ఐదేళ్లుగా కోటపాడు పాఠశాల వంట ఏజన్సీ నిర్వాహకురాలిగా పనిచేస్తున్న నాగుల శ్యామలరాణిని నెల రోజుల క్రితం అకారణంగా తొలగించినట్లు సర్పంచ్ పరసా సత్యన్నారాయణ తెలిపారు. ఆమె స్థానంలో టీడీపీకి చెందిన కంభంపాటి మహాలక్ష్మి అనే మహిళను నియమించారని, ఆమె అనుభవ రాహిత్యం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు చెప్పారు.

మట్టి దందా.. అడ్డుకట్ట ఉందా!

- యథేచ్ఛగా పోలవరం కుడికాలువ గట్టు మట్టి విక్రయాలు
- టీడీపీ నాయకుడికి కాసులు కురిపిస్తున్న మట్టి దందా



పంగిడిగూడెంలో పోలవరం కుడి కాలువ గట్టుపై జరుగుతున్న మట్టి తవ్వకాలు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో టీడీపీకి చెందిన ఒక చోట నాయకుడు మట్టి దందాకు పాల్పడుతున్నాడు. అధికారులు తన కనుసన్నల్లో ఉన్నారని చెబుతూ కాలువ గట్టును యథేచ్ఛగా కొల్లగొడుతున్నాడు. ట్రాక్టరు మట్టిని రూ.800 నుంచి రూ.1,000కు అమ్ముకుంటూ, సొమ్ము చేసుకుంటున్నాడు. వివరాల్లోకి వెళితే.. పంగిడిగూడెంకు చెందిన ఒక టీడీపీ చోటా నాయకుడు పోలవరం కుడి కాలువ గట్టుపై కన్నేశాడు. దాన్ని ఆదాయ మార్గంగా ఎంచుకున్నాడు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా జేసీబీ సహాయంతో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరుపుతున్నాడు. ఈ గ్రావెల్ మట్టిని దెందులూరు మండలం పెరుగ్గూడెం తదితర గ్రామాలకు విక్రయిస్తూ కాసులు దండుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఆ చోటా నాయకుడు మట్టి తవ్వకాలను గురువారం ఉదయం నుంచి ముమ్మరంగా జరిపాడు. దీనిపై సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఉన్నతాధికారులు సంబంధిత దిగువ స్థాయి అధికారులను విచారణకు ఆదేశించారు. అయితే ఒక రైతు తన భూమిని చదును చేసుకుంటున్నాడని, తమ దృష్టికి రాగానే ఆ పనులను కూడా నిలుపుదల చేయించి, సంబంధిత వ్యక్తికి వార్నింగ్ ఇచ్చి విడిచి పెట్టామని.. అక్రమ మట్టి తవ్వకాలను కప్పిపుచ్చేలా అధికారులు మాట్లాడటం గమనార్హం. భూమి చదును చేయాలంటే మట్టిని ట్రాక్టర్‌లో లోడ్ చేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా అధికార పార్టీకి చెందిన చోటా నాయకుడి అక్రమ మట్టి తవ్వకాలకు అధికారులు తాత్కాలికంగా క్లెం వేశారనే చెప్పొచ్చు. ఇదిలా ఉంటే ఈ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఎస్‌ఈ పేర్కొన్నారు.

భూవివాదంలో మహిళలపై దాడి



చింతలవల్లిలో మహిళలపై దాడి చేస్తున్న వ్యక్తి

ముసునూరు: భూ వివాదంలో మహిళలపై ఓ వ్యక్తి కర్రతో దాడికి పాల్పడిన ఘటన మండలంలో జరిగింది. చింతలవల్లికి చెందిన వైఎస్సార్ సీపీ అనుచరుడు డేరంగుల గంగయ్య కుటుంబ సభ్యులు రహదారి పక్కన తమ స్థలంలో ఇల్లు నిర్మాణానికి ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇల్లు నిర్మించడానికి వీల్లేదంటూ వారిని సమీప భూసరిహద్దు దారుడైన టీడీపీ కార్యకర్త ఏనుగుధాటి నాగరాజు అడ్డగించాడు. తాము కొనుగోలు చేసుకున్న భూమిలో ఇల్లు కట్టుకోవద్దనడానికి నీవెవరంటూ గంగయ్య కుటుంబ సభ్యులు ఎదురు ప్రశ్నించారు. అనంతరం వాగ్వివాదం ముదరడంతో నాగరాజు తీవ్ర ఆగ్రహంతో గంగయ్య భార్య సరళ, కోడలు స్రవంతిపై కర్రతో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో స్రవంతి తలకు తీవ్రగాయమైంది. క్షతగాత్రులను బంధువులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారంతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు.

అనుమానమే పెనుభూతమై..



సుశీల మృతదేహం వద్ద పోలీసులు


పాలకోడేరు: భర్త అనుమానం ఆమె పాలిట మరణశాసనమైంది. గత పదిహేనురోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చదలవాడ సుశీల (54) గురువారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం మోగల్లు గ్రామానికి చెందిన చదలవాడ గంగరాజు తన భార్య సుశీలపై అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో బయట నుంచి వచ్చిన భార్యను గంగరాజు ఎక్కడికి వెళ్లావు అని ప్రశ్నించి.. దగ్గర్లోనే ఉన్న రెక్కలు లేని ఫ్యాన్‌తో ఆమె తలపై గట్టిగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి అక్కడినుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఆమె మృతి చెందింది. ఈమెకు ముగ్గురు సంతానం. దాడి ఘటనపై సుశీల కోడలు సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గంగరాజును అరెస్ట్ చేసి కోర్టు హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

రెండు ఇళ్లల్లో చోరీ

ఏలూరు టౌన్: నగరంలో రెండు ఇళ్లల్లో జరిగిన చోరీలపై పోలీసులు కేసు మోదు చేశారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరు శివారు ఇంద్రప్రస్థలో ఒక దొంగ తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డాడు. అనుమళ్ళ భరత్‌రెడ్డి, పక్కనే ఉన్న మొగలపు భరత్ అనే వ్యక్తుల ఇంట్లో దొంగ ఇంటి తాళాలు పగులకొట్టి ఒక చైన్, అరకేజీ వెండి, మరో ఇంట్లో 5 కాసుల బంగారం, అరకేజీ వెండి వస్తువులు అపహరించాడు. ఇంటి యజమానులు భరత్‌రెడ్డి, భరత్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నేరస్తుడు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ చెప్పారు.

అద్దె లేకుండా సీఎస్‌ఓకు క్వార్టర్స్ కేటాయింపు

- 'సాక్షి' కథనంతో వెలుగులోకి..
- విచారణ జరుపుతామన్న ఆలయ ఈఓ మూర్తి



ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల : శ్రీవారి దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ అధికారి (సీఎస్‌ఓ)కి అద్దె లేకుండా క్వార్టర్స్ కేటాయించడం వివాదాస్పదమైంది. ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ఒక కథనం ద్వారా సీఎస్‌ఓ ఉచితంగా క్వార్టర్స్‌లో ఉంటున్న విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే. ఏ సంస్థలో పనిచేసే ఉద్యోగి అయినా.. ఆ సంస్థకు సంబంధించిన గృహంలో నివాసం ఉంటే అందుకు అద్దెకట్టి తీరాల్సిందే. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే చినవెంకన్న దేవస్థానం అధికారులు ఈ విషయాన్ని మరిచారో ఏమో గానీ.. కొండపైన దేవస్థానం క్వార్టర్స్‌లో ఏడాది నుంచి నివాసం ఉంటున్న సీఎస్‌ఓ నుంచి మాత్రం అద్దె వసూలు చేయలేదు. టెండర్ ద్వారా నియమించబడిన సీఎస్‌ఓకు నెలకు రూ.50 వేలను వేతనంగా సంబంధిత కాంట్రాక్టర్ ఇస్తున్నారు. ఆయనకు ఏదైనా వసతి కల్పించాలంటే ఆ కాంట్రాక్టరే బాధ్యత వహించాలి. కానీ ఇక్కడ మాత్రం ఆ బాధ్యతను దేవస్థానం అధికారులు చేపట్టారు. వేలాది రూపాయలు వెచ్చించి మరీ క్వార్టర్స్‌ను ముస్తాబు చేసి సీఎస్‌ఓకు అప్పగించారు. ప్రతి నెలా సీఎస్‌ఓ జీతం నుంచి హెచ్‌ఆర్‌ఏ కట్ చేయాలి. లేదా ఎంఆర్ ద్వారా అద్దె చెల్లింపు జరిగేలా అధికారులు చూడాలి. కానీ ఇక్కడ అవేమీ జరగకపోవడం గమనార్హం. ఏడాది నుంచి క్వార్టర్స్‌లో ఉంటున్న సీఎస్‌ఓ ఇప్పటివరకు ఒక్క పైసా కూడా దేవస్థానానికి అద్దె చెల్లించకపోవడం వల్ల స్వామివారి ఆదాయానికి గండి పడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి నెలా ఈఓ, దేవస్థానం సిబ్బంది సైతం వారు ఉంటున్న క్వార్టర్స్‌కు అద్దె చెల్లిస్తుంటే, సీఎస్‌ఓకు మాత్రం ఉచితంగా క్వార్టర్స్ కేటాయించడం విడ్డూరంగా ఉంది. ఇదే కాకుండా క్వార్టర్స్‌తో పాటు పద్మావతి రూమ్స్‌లోని ఒక గదిని, జంట గోపురాల వద్ద ఉన్న ఒక కార్యాలయాన్ని సీఎస్‌ఓ ఆఫీస్‌కు కేటాయించడం కొసమెరుపు. అయితే ఇటీవల ఆలయ ఈఓ ఎస్వీఎస్ఎన్ మూర్తి పద్మావతిలోని గదిని సీఎస్‌ఓతో ఖాళీ చేయించారు. ఇదిలా ఉంటే గురువారం విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఈఓ సమాధానమిస్తూ హెచ్‌ఆర్‌ఏ అనేది ఎవరైనా కట్టి తీరాల్సిందేనన్నారు. సీఎస్‌ఓ నియామకం జరిగినప్పుడు అప్పటి అధికారులు ఏం మాట్లాడుకున్నారో తెలుసుకుని, ఆలయ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావుతో చర్చించిన తరువాత తగు చర్యలు చేపడతామన్నారు.

సంచారజాతులను పట్టించుకోని

కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెంద్ర వీరన్న



భీమవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరన్న

భీమవరం (ప్రకాశం చౌక్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా ఇంతవరకు సంచారజాతుల వారిని గుర్తించిన దాఖలాలు లేవని వైఎస్సార్ సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న అన్నారు. గురువారం భీమవరంలో పూలే భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఎంబీసీ కార్పొరేషన్ పాలకమండలి సభ్యులను ఇంతవరకు నియమించకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వానికి సంచార జాతుల మీద ఏమాత్రం గౌరవం, బాధ్యత లేదన్నారు. ఎంబీసీ వర్గాలకి స్థానిక సంస్థల్లో ఐదు శాతం రిజర్వేషన్ కేటాయిస్తామని, సంచార జాతుల వారికి 200 యూనిట్లు విద్యుత్ రాయితీ కల్పిస్తామని, దేవాలయ పాలకమండలిలో సభ్యత్వం, మున్సిపల్ కార్పొరేషన్‌లో కోఆప్షన్ మెంబర్లుగా అవకాశం కల్పిస్తామని, గుర్తింపు కార్డు మంజూరు చేసి వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు ఎన్నికల్లో హామీలు ఇచ్చారని.. కానీ ఇప్పటివరకు ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. సంచార జాతులను, బీసీ వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంచార జాతుల అభివృద్ధికి జగన్ కృషి చేశారన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన రైతు పోరుబాట మహా ధర్నాకు మద్దతుగా అన్ని జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాకు అందరూ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: మానసిక స్థితి సరిగా లేని ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శంభునిపేటలో 10వ వార్డులో నివాసం ఉంటున్న కె.అనుషా (24)కు మూడేళ్ల క్రితం వివాహం అయ్యింది. వివాహం ముందు నుంచి ఆమె మానసిక పరిస్థితి బాగోకపోవడంతో భర్త నవీన్ స్థానికంగా చికిత్స చేయిస్తున్నాడు. గురువారం భర్త బయటకు వెళ్లి.. కాసేపటి అనంతరం ఇంటికి వచ్చే సరికి తలుపులు వేసి ఉన్నాయి. ఎంతసేపు కొట్టినా తలుపులు తీయకపోవడంతో స్థానికుల సహకారంతో ఇంటి వెనుక గుమ్మం నుంచి లోపలకి వెళ్లి చూసేసరికి ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉంది. అనుషా తండ్రి పెద్దిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పృథ్వీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తహసీల్దార్ వై దుర్గాకిషోర్ పంచనామా నిర్వహించారు.

క్లుప్తంగా

ఘనంగా సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణం



ఆంజనేయస్వామి హోమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు సెంటర్‌లో దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సువర్చలా సమేత ఆంజనేయ స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పుష్పార్చన, ఆంజనేయ హోమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యదర్శి ఆకుల నరసింహమూర్తి పర్యవేక్షించారు.

కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: ఈనెల 14వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్సైజ్ కేసులతో పాటు రాజీకాదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశించారు. గురువారం తణుకు కోర్టులో ఎక్సైజ్, పోలీసులు ఉన్నతాధికారులకు నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. తణుకు కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైక్రో ఫైలేరియా సర్వే

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ పరిధిలోని వీకర్స్ కాలనీ 3వ వార్డులో గురువారం సాయంత్రం మైక్రో ఫైలేరియా సర్వే నిర్వహించారు. వైద్యాధికారి శ్రావ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ వై.వి.లక్ష్మణరావు పర్యవేక్షణలో గురువారం ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలచే సర్వే జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఫైలేరియాసిస్ హెల్మెంట్ వర్గానికి చెందిన సన్నని పరాన్నజీవి అన్నారు. ఈ పరాన్నా జీవి వల్ల దుష్పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, వ్యాధి నిరోధక శక్తి లోపించి, ఇతర వ్యాధులు వస్తాయని చెప్పారు. పరిశుభ్రత పాటించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు దోమ తెరలు వాడాలని, వారానికి ఒక్కసారి డ్రై డే పాటించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కే.మంగతాయరు, సౌజన్య, మల్లికా, జ్యోతి, రత్నం, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. అధికారులంతా సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీ ఎం.లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థకు బ్యాంకింగ్ వెన్నెముక

తణుకు టౌన్: బ్యాంకింగ్ రంగానికి ఆర్థిక వ్యవస్థ వెన్నెముక వంటిదని రిటైర్డ్ ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ చెరుకూరి సుబ్రహ్మణ్యం చెప్పారు. గురువారం తణుకులోని ఎస్‌డీ కాలేజీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో భారతదేశంలో బ్యాంకింగ్‌లో మారుతున్న పోకడలు, ఆర్‌బీఐ, వాణిజ్య బ్యాంక్‌ల పాత్ర అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ యొక్క వర్గీరణ, విద్యార్థులకు వివరించారు. బ్యాంకింగ్ ఫైనాన్స్, ఇన్సూరెన్స్, విభాగాలలో ఉద్యోగాలు సాధించేందుకు విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ప్రిన్సిపాల్స్ వీవీ సత్యనారాయణరెడ్డి, యూ లక్ష్మీసుందరి బాయి, కెసురేష్, ఎస్ సత్య కిరణ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అత్తిలి: స్థానిక అరుంధతీపేటకి చెందిన యజ్జల దివ్య అనే బాలికకు జ్వరం వల్ల ఆర్గాన్‌లు చెడిపోవడంతో సేవ్ద పీపుల్ అనే వాట్సాప్ గ్రూపు బాయ్స్ స్పందించి రూ. 30 వేలు విరాళంగా అందజేసారు. రాజమండ్రి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇప్పటికే రూ. 4 లక్షలు ఖర్చుచేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు పర్యాయాలు ఆసుపత్రికి తీసుకువెళ్లాల్సి ఉండటంతో సేవ్ద పీపుల్ వాట్సాప్ గ్రూపు బాలురు స్పందించి ఈ ఆర్థిక సహాయం అందజేశారు. ఈదూరి రాంబాబు, సిరిపురపు వాసు, రాపాక ప్రసాద్, పానుకు వినయ్‌బాబు, రెడ్డి సత్యనారాయణ, అరుంధతీపేట యూత్ పాల్గొన్నారు.

రైతులకు ఏది భరోసా?

- ఉచిత పంటల బీమాకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం
- బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంటలకు ఉచిత బీమా



ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

తాడేపల్లిగూడెం: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతింటే ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఆదుకోవాలి. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పనిచేస్తోంది. రైతులకు అండగా ఉండడం మాట అటుంచితే, రైతు వ్యతిరేక విధనాలను అనుసరిస్తూ రైతులపై పగ సాధింపు చర్యల్లా ఉన్నాయని పలువురు రైతులు అంటున్నారు. రైతులకు అండగా ఉండడం మాట అటుంచితే, రైతు వ్యతిరేక విధనాలను అనుసరిస్తూ రైతులపై పగ సాధింపు చర్యల్లా ఉన్నాయని పలువురు రైతులు అంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఉచిత పంట బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. వర్షాలు, తుఫాన్‌లతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు రైతులను ఆదుకునేందుకు దోహదపడుతుందనే ఉద్దేశంతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన నుంచే ఉచిత పంట బీమా పథకాన్ని ఈ–క్రాప్‌లో నమోదు చేసి సాగు విస్తీర్ణం అంతటికీ బీమా వర్తించేలా ప్రభుత్వమే రైతుల తరపున ప్రీమియం చెల్లించేది. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం పడేది కాదు. బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతులు ఆర్థిక ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండేది కాదు. పంటలకు నష్టం వాటిల్లితే ఠంచన్‌గా పరిహారం అందేది. కాని ఇది గడచిన ఆరు నెలలుగా భరోసా లేని వ్యవసాయాన్ని రైతాంగం చేస్తుంది. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కింద రైతుకు రూ.20 వేలు ఇస్తామని సూపర్ సిక్స్ పథకంలో ఇస్తామని ప్రకటించింది. అది వ్యవసాయ క్షేత్రాల గట్ల వద్దకు చేరలేదు. నియోజకవర్గంలో ఎర్రకాల్వ బాధిత రైతులు ఉన్నారు. తాడేపల్లిగూడెం మండలం బంగారు గూడెం, వీరంపాలెం, పట్టింపాలెం, వెంకట్రావుపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాధపురం, మారంపల్లి , నందమూరు, ఆరుళ్ల గ్రామాల ఆయకట్టు ఎర్రకాల్వ పరీవాహక ప్రాంతంగా ఉంది. ఈ ఏడాది మూడు సార్లు ఎర్రకాల్వకు వరదలు వచ్చాయి. దీంతో పాటు పెంటపాడు మండలంలో మీనవల్లూరు. రావిపాడు వంటి గ్రామాలకు ఎర్రగంగ ప్రభావం పడి, పంట ఎర్రగంగార్పణం అయ్యింది. మూడు సార్లు నారుమళ్లు వేశారు. పంట ఖర్చులు పెరిగిపోయాయి. తీరా దిగుబడులు వచ్చే సరికి ఎకరాకు 20 బస్తాలకు లోబడి మాత్రమే వచ్చాయి. రైతులు నచ్చిన మిల్లుకే ధాన్యం తోలుకోవచ్చని ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చినా, ధాన్యంలో తేమ శాతం 17 దాటి ఉంటే కోతలు పడ్డాయి. కనీసమద్దతు ధర కూడా రైతుల చేతిలో పడలేదు. కౌలుకు పొలాలు ఇచ్చిన రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారయ్యింది. వాస్తవ పరిస్థితిని చూసి, కౌలు రైతు దగ్గర నుంచి ముక్కుపిండి మక్తా వసూలు చేయలేరు. అలాగని, కౌలు ఆధారంగా బతికే ఈ కుటుంబాలకు కౌలు కింద రైతులు సొమ్ము ఇవ్వక పోతే గడవని సంకటస్థితి. ఇలాంటి పరిస్థితిలో కౌలురైతులు, అసలు ఆసాములు ఇబ్బంది పడినా వీరి కష్టాన్ని తీర్చిన దాఖలాలు లేవు. నియోజకవర్గంలో గతఐదు సంవత్సరాలలో నియోజకవర్గంలో 60,506 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.55కోట్ల 51 లక్షల 11 వేల 549ల సాయం అందింది. సున్నా వడ్డీ 14,037 మంది రైతులకు ఒక కోటీ 67 లక్షల 41వేల 289 రూపాయలు అందాయి. ఉచిత పంటల బీమా కింద 18,254 మంది రైతులకు 22 కోట్ల 50 లక్షల 98 వేల 117 రూపాయలు ఇచ్చారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద 10,601మంది రైతులకు ఐదు కోట్ల 27 లక్షల 44 వేల 792 రూపాయలు అందజేశారు. ఈ తరహా సాయాలు గడచిన ఆరు నెలల కాలంలో రైతులకు అందలేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ధాన్యం.. దైన్యం



ఎర్రకాలువ వరద కారణంగా ముద్దాపురంలో నీట మునిగిన వరి పంట (ఫైల్)

తణుకు టౌన్: అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు. వేలాది రూపాయలు పెట్టుబడిపెట్టి, కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలుకు నోచుకోక తమ కళ్ల ముందే దైన్యంగా కనిపిస్తుంటే ఏం చేయాలో తోచక రైతు అయోమయం చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తణుకు నియోజకవర్గం పరిధిలో సుమారు 39,500 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. యంత్రాల సాయంతో కోతలు, నూర్పులు చేసి పంట అమ్మకానికి సిద్ధమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొంత మేర పంటకు నష్టం కలిగింది. అయితే మిగిలిన పంటను అమ్ముదామంటే తమకు అవగాహన లేదని, అధికారుల జాడ కూడా కరువై కష్టపడి తాము పండించిన పంటను అమ్ముకోలేక దీనస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు కష్టం దళారుల చేతికి..

రైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారు. ఇటీవల నూర్పులు చేసిన ధాన్యం కొనుగోలుకు నోచుకోకపోవడంతో ధాన్యం బస్తాలను పంట పొలాల్లోనే నిల్వ చేస్తున్నారు. రోజులు గడుస్తున్న ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దిక్కు లేక దళారులకు అమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము దళారుల చేతిలో మోసపోతున్నామని తెలిసినప్పటికీ ఏం చేయాలో తోచక తమ కష్టాన్ని వారి చేతిలో పెడుతున్నామంటున్నారు.

నాటి పరిస్థితి నేడు లేదు..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తాము పండించిన పంటకు నేరుగా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు చేసే పరిస్థితి ఉండేది. అధికారులు మాకు అవగాహన కల్పిస్తూ పంట కొనుగోలు చేసేవారని రైతులకు చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ పరిస్థితి లేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ఇప్పుడు తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి .రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

వర్షాలకు నష్టపోయాం



ఇటీవల కురిసిన వర్షాలకు కొంతవరకు పంట నష్టపోయాం. మళ్లీ వర్షం కురిస్తే చేతికి అందివచ్చిన పంట చేజారిపోయే ప్రమాదం ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన లేదు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు జరిగేవి. ప్రస్తుతం ఎక్కడ జరుగుతున్నాయో..ఎలా జరుగుతున్నాయో తెలియడం లేదు. అంత అయోమయంగా ఉంది.

–ఉప్పల ఆంజనేయలు, రైతు, ముద్దాపురం

అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



అత్తిలి: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్



ఇరగవరం: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

అత్తిలి: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అన్నారు. గురువారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు ప్రజారోగ్య లక్ష్యాలు, ఎల్‌ఎస్‌డీఏస్‌కు సంబంధించి మొదటి రోజు శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీపీడీవో ఎం శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ ఎస్ చైతన్యబాబు, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ సిహెచ్ రమేష్‌కుమార్, ఏపీఎం ఎస్‌కే మొహమ్మద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి, కె శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి సాధనకు కృషి

ఇరగవరం: సుస్థిరాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఇరగవరంలో సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారుల శిక్షణలో ఆయన మాట్లాడారు. సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. నూరు శాతం అభివృద్ధి సాధించిన పంచాయతీకి ప్రభుత్వం రూ.కోటి బహుమతి పంచాయతీ అందజేస్తుందన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

తణుకు టౌన్: మండల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఆర్ లోహిత్ జయ సాగర్ తెలిపారు. గురువారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామప్రసాద్, ఏవో వీ కృష్ణచంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

పెంటపాడు: ఎల్‌ఎస్‌డీజీఎస్‌పై ఎంపీడీఓ ఝాలాజీ అధ్యక్షతన గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ హెల్తీ విజన్, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, సురక్షిత మంచినీరు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తహసిల్దార్ ఏడిద శ్రీనివాస్, ఎంఈవో టీవీ రామకృష్ణ, ఈవోపీఆర్డీ ప్రసాద్ ఉన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

ఇరగవరం: ఎన్నికల్లో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నాయకులు విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు చార్జీల పేరుతో భారాన్ని మోపడం ఏరు దాటిన తరువాత తెప్ప తగలబెట్టడమేనని సీపీఐ మండల కన్వీనర్ కామన మునిస్వామి విమర్శించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఇరగవరం మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలను పెంచి కోట్ల రూపాయిలను ప్రజలపై ఆర్థిక భారం వేశారని, ఎన్నికల ముందు ఎటువంటి భారాలు వేయమని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు అనేక భారాలు వేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. గుత్తుల రామాంజనేయులు, గుబ్బల ముత్యాలు, జక్కంశెట్టి గంగాధర్, ఎం.ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.నరసింహమూర్తి తెలిపారు. గురువారం సాయంత్రం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో ఆరుగొలను, దండగర్ర, కొత్తూరు, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, ఆరుళ్ల, నందమూరు, మారంపల్లి, కుంచనపల్లి సబ్ స్టేషన్ పరిధిలో కుంచనపల్లి, ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, కేఎస్‌ఎన్ కాలనీ, టిడ్కో గృహాలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకు అర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం తణుకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు మునిసిపాలిటి పరిధిలోని రామకృష్ణ మఠం ఏరియా, సజ్జాపురం, ఆపిల్ హాస్పిటల్ ప్రాంతాల్లోను, రూరల్ పరిధిలోని మండపాక, పైడిపర్రు, సూర్యారావుపాలెం గ్రామాల్లోని ఇండస్ట్రియల్ సర్వీసులకు, ఇరగవరం మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ ఆదినారాయణ

తణుకు అర్బన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్‌ఐ డి.ఆదినారాయణ అన్నారు. గురువారం తణుకు చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మారుతీ కళాశాల విద్యార్థులకు చట్టాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ద్విచక్ర వాహన నడిపే సమయంలో విద్యార్థులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. చిన్నపాటి ప్రమాదాల్లో తలకు గాయాలై ఎంతోమంది మరణిస్తున్నారని, ప్రాణ నష్టం జరిగిన తర్వాత హెల్మెట్ ధరించి ఉంటే బతికే వారమనే ఆలోచన వస్తుందని స్పష్టం చేశారు. వాహనాలను నడిపే క్రమంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, ఏకాగ్రతలేని డ్రైవింగ్ ప్రమాదాలకు కారకమని అన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని గుర్తుచేశారు. విద్యార్థులు ఎక్కువగా డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని, మత్తులో తెలియక చేసే తప్పులు నేరాలుగా మారిపోతున్నాయని చెప్పారు. విద్యార్థినులు, మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించకూడదని దీనిపై ఫోక్సో చట్టాలు కఠినంగా ఉన్నాయని స్పష్టం చేశారు. అనంతరం డ్రగ్స్ వద్దు కుటుంబమే ముద్దు.. మన ఆలోచనలే మనకు శ్రీరామరక్ష.. కలిసి మెలిసి ఉందాం డ్రగ్స్ వద్దని పోరాడుదాం అనే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తణుకు టౌన్: బాల్య వివాహాలు జరగకుండా నిరోధించాలని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ మారుతీదేవి చౌదరి చెప్పారు. గురువారం కళాశాల మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా వాటిని నిరోధించాలని కోరారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు జీ ఇందిరాకుమారి, డీ కనక మహాలక్ష్మీ, ఇ జ్యోతి కిరణ్మయి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోండి



దివ్యాంగుల సెంటర్‌లో దివ్యాంగులతో ఎంఈఓ వి.హనుమ

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత దివ్యాంగుల కేంద్రంలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వి.హనుమ సూచించారు. స్థానిక దివ్యాంగుల శిక్షణ కేంద్రంను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల నైపుణ్యాల రికార్డులను పరిశీలించారు. సమగ్ర శిక్ష ద్వారా భవిత కేంద్రంలో కల్పిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రత్యేక విద్యతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ సేవలు అందిస్తారని, దివ్యాంగుల పిల్లలకు వివిధ అలవెన్సులు అందజేస్తారని తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, సీఆర్‌పీలు నానిబాబు, ఏసుబాబు, నగేష్, పుల్లారావు, చలం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి



తణుకులో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకు వినతిపత్రం ఇస్తున్న భీమారావు, కార్మికులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల 4 నెలల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని, పీఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో జమచేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. గురువారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాలే అతి తక్కువ అని, అవి కూడా సకాలంలో చెల్లించకపోతే వారు ఎలా బతుకుతారని నిలదీశారు. 42 నెలల పీఎఫ్ సొమ్ముకు సంబంధించి కేవలం ఇప్పటివరకు 15 నెలలు మాత్రమే కార్మికుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని అన్నారు. 150 పడకల ఆస్పత్రి సరిపడా కార్మికులను నియమించి, కార్మికులకు పనిఒత్తిడి తగ్గించాలని కోరారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంగల అరుణకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.పుష్పలత, ఎలిపే హైమావతి, వై.రత్నం, నేకూరి లక్ష్మి, డి.లక్ష్మణరావు, చింతాలు, మెరిపే బేబీ, టి.భారతి, కుమారి పాల్గొన్నారు.